
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 23 । జూన్ । 2023



నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1590, మధ్య డెల్టాకు 1140, పశ్చిమ డెల్టాకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో నిత్యాన్నదానం ట్రస్టుకు భూపతి రాజేష్, చంద్రకళ దంపతులు (పాశర్లపూడి) గురువారం రూ.లక్ష విరాళంగా అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	35.5	26.0
కాకినాడ	35.7	26.1
అమలాపురం	37.0	26.0

న్యూస్‌రీల్

వెంకన్న నిత్యాన్నదానానికి రూ.11,111 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఈతకోటకు చెందిన ఎస్.దుర్గారావు, గంగాలక్ష్మి దంపతులు రూ. 11,111 విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందజేశారు.

తొండంగి ఎంపీపీ అరుణ్‌కుమార్ మృతి



ఎంపీపీ అరుణ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించిన మంత్రి దాడిశెట్టి రాజా



ఎంపీపీ అంగులూరి అరుణ్‌కుమార్ ఫైల్

తొండంగి: మండల పరిషత్ అధ్యక్షుడు అంగులూరి అరుణ్‌కుమార్ (36) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. మండలంలోని ఒంటిమామిడి పంచాయతీ కొత్తపాకలు గ్రామానికి చెందిన ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యం మెరుగుపడి ఇంటి వద్ద ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున మళ్లీ అనారోగ్యంగా ఉండడంతో కారులో కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అరుణ్‌కుమార్ జెడ్పీటీసీ సభ్యుడిగా సేవలందించారు. వాలీబాల్ ప్లేయర్‌గా మంచి గుర్తింపు పొందారు. వైఎస్సార్ సీపీ పార్టీలో చేరిన నాటి నుంచి అనేక కార్యక్రమాల్లో పాల్గొని గుర్తింపు పొందారు. అరుణ్‌కుమార్ అకాల మరణం అతని కుటుంబంలోనూ, వైఎస్సార్ సీపీ శ్రేణుల్లోనూ తీవ్రవిషాదం నింపింది. ఆయనకు భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి దాడిశెట్టి రాజా

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కొత్తపాకలులోని ఎంపీపీ స్వగృహానికి వెళ్లి అరుణ్‌కుమార్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనమృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, గాబు రాజు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, బత్తుల వీరబాబు తదితరులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ పసపులేటి సతీష్ అరుణ్ కుమార్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

సుభిక్షపాలనకే సురక్ష



- ప్రభుత్వ పథకాలు, సమస్యలపై ఆరా
- అర్హులందరికీ లబ్ధి అందేలా చర్యలు
- రేపటి నుంచి జిల్లాలో ప్రారంభం

సాక్షి అమలాపురం: సంక్షేమం అభివృద్ధి రెండు చక్రాలుగా పరిపాలనా రథాన్ని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా సరికొత్త కార్యక్రమానికి నేడు శ్రీకారం చుడుతున్నారు. అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా ఇది అమలు కానుంది. ఇందులో భాగంగానే ప్రతి ఊరిలో, గడపగడపకూ అధికార గణం వెళ్లి జనం ఇబ్బందులపై ఆరా తీసి, తక్షణం పరిష్కరించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఏమైనా సమస్యలున్నా, సర్టిఫికెట్లు కావాలన్నా మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అలా తిరిగినా ఫలితం దక్కేది కాదు. పథకాల అమలులో జన్మభూమి కమిటీల పెత్తనంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయి. మీ ఇంట్లో ఏమైనా సమస్యలున్నాయా, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరుగుతుందా అంటూ అధికారులే ప్రజల గడప వద్దకు వస్తున్నారు. ఏ కమిటీల పెత్తనం లేకుండా ప్రజల చెంతకే సంక్షేమ పథకాలను చేరుస్తారు. ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఇదీ నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుపరిపాలన.

తొలుత గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో...

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తొలుత గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 467 గ్రామ, 48 వార్డు సచివాలయాలు కలిపి మొత్తం 515 సచివాలయాలు ఉన్నాయి. గ్రామ సచివాలయాల్లో 4,112 మంది, వార్డు సచివాలయాల్లో 411 మంది మొత్తం 4,523 సచివాలయ సిబ్బంది ఉన్నారు. గ్రామాల్లో 8,705 మంది, పట్టణాల్లో 918 మంది కలిపి మొత్తం 9,623 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరందరితో కలిసి ప్రజాప్రతినిధులు, గృహసారథులు శనివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారు. సమస్యలున్నట్లయితే వివరాలను నమోదు చేసుకుంటారు.

రెండో దశలో..

రెండో దశలో జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. వీటిని ఆయా శాఖల జిల్లా అధికారులు సందర్శిస్తారు. ఈ కార్యక్రమాన్ని జూలై ఒకటి నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తారు. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అదే రోజు ఉచితంగా అందజేయనున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా, తహసీల్దార్, ఈవోఆంర్‌డీ రెండో బృందంగా, పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూడో బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసే పనిలో కలెక్టరేట్ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ పథకాలకు అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు ఒకటో తేదీన పథకాలు మంజూరు చేస్తారని అధికారులు వెల్లడిస్తున్నారు.



జగనన్న సురక్ష పథకంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)

సమన్వయంతో ముందుకు...



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు తహసీల్దార్లతో సమన్వయంతో పనిచేస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండలాల్లో నియమితులైన పర్యవేక్షణ అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లనున్నారు. అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు తక్షణం జారీ చేసేలా చర్యలు తీసుకున్నాం.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

యంత్రాంగం కసరత్తు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేసేందుకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం అమలవుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సచివాలయాల ద్వారా 534 పౌరసేవలు అందించడానికి ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రారంభించనున్నారు.

నేడు రత్నగిరి ట్రస్ట్‌బోర్డు సమావేశం

పలు నిర్మాణ పనులపై చర్చ



అన్నవరం: అన్నవరంలోని సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి (ట్రస్ట్‌బోర్డు) సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. ప్రకాష్ సదన్ సత్రం దిగువన ధర్మకర్తల మండలి సమావేశహాలులో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌తో పాటు దేవస్థానం అధికారులు పాల్గొంటారు. రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ నిర్మాణ పనులపై ధర్మకర్తల మండలి చర్చించనుంది. రూ.4.74 కోట్లతో జాతీయ రహదారిపై దేవస్థానం స్థలంలో నిర్మించనున్న సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాద విక్రయ భవనం, తదితర నిర్మాణాల టెండర్లు ఖరారుపై చర్చించనుంది. సత్యగిరి నుంచి దిగువకు మూడో ఘాట్‌రోడ్ నిర్మాణం కోసం చేపట్టిన జంగిల్ క్లియరెన్స్ పనులు, సీఆర్వో కార్యాలయం వద్ద కేశఖండనశాల నిర్మాణం, సత్యగిరి వెళ్లేందుకు మరో రోడ్డు నిర్మాణ పనులు కూడా చర్చకు రానున్నాయి. దాత మట్టే సత్యప్రసాద్ స్వామివారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవికి రూ.కోటి వ్యయంతో వజ్ర కిరీటం చేయించడానికి సంసిద్ధత తెలిపిన నేపథ్యంలో దానిపై కూడా దృష్టి పెట్టనున్నారు. ఇప్పటికే దాత స్వామివారికి వజ్రకిరీటం చేయించి గత ఆగస్టులో సమర్పించారు. కిరీటం పదేళ్లు మాత్రమే అలంకరిస్తారనే నిబంధనపై దాత అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పష్టత కోరినట్లు తెలిసింది. తాజాగా సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు

కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన



భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష రీ సర్వే మొదటి దశలో సర్వే పూర్తయిన 67 గ్రామ సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ఆయా మండలాల అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులుతో కలిసి 67 గ్రామాలకు చెందిన కార్యదర్శులు, మండలాల సబ్ రిజిస్ట్రార్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పనిసరిగా నిర్వహించాలని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల వివరాలు నమోదు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫింగర్ ప్రింట్ స్కానర్లు, పరికరాలు సరఫరా చేస్తామన్నారు. సహకార సంఘాల రిజిస్ట్రేషన్ కుడా స్థానికంగా జరగాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వారికున్న సందేహాలను సబ్ రిజిస్ట్రార్ ద్వారా నివృత్తి చేసుకుని, లోపాలకు తావులేకుండా పక్కాగా రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ సబ్ డివిజన్ అయిన భూములకే రిజిస్ట్రేషన్ చేయాలని సేలు, గిఫ్టు, మార్ట్‌గేజ్ సెటిల్‌మెంట్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆ ప్రకారం స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ల ఫీజులు వసూలు చేయవలసి ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

చిన్న వయసు నుంచే శారీరక దారుఢ్యం, క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని జిల్లాకు పేరు తీసుకుని రావాలని విద్యార్థులను కలెక్టర్ శుక్లా కోరారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియం ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మే నెలలో వార్షిక వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం క్రీడాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో 50 క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించామన్నారు. వీటికి సంబంధించి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా పరికరాలకు, 50 క్యాంపులకు రూ.3.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న అమలాపురానికి చెందిన రంకిరెడ్డి సాయిరాజ్ సాత్విక్‌ను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన 20 వేల మంది భక్తులు



సత్యదేవుని సన్నిధిలో నాగిరెడ్డి తదితరులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 20 వేల మంది దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 1,110 జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఐదు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి గురువారం సాయంత్రం సత్యదేవుని దర్శించుకున్నారు. దేవస్థానంలో రెగ్యులర్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగులను మూడు నెలలకొకసారి విభాగాలు మార్చాలని దేవదాయశాఖ కమిషనర్ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

అల్లవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ పారదర్శకంగా అమలుచేస్తూ సమన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు మన్నాకాలనీలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 200 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్ పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోని పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దని అన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను వర్గ, కుల, మతం, పార్టీ చూడకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. లూటుకుర్తి బులిరాజు, ముసునూరి అర్జునరావు, మల్లవరపు రాఘవులు, ఉండ్రాజవరం మరియమ్మ, ఏసు, కవిటికి సత్తిబాబుతో పాటుగా 200 మంది పార్టీలో చేరారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ రాకావు విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సొసైటీ చైర్మన్లు అల్లూరి సురేష్‌రాజు, గుర్రం బాబులు, పార్టీ నాయకులు గునిశెట్టి చినబాబు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫిలేట్

- స్కూల్ బస్సులకు కొనసాగుతున్న వాహన సామర్థ్య తనిఖీలు
- జిల్లాలో ఇంకా ఎఫ్‌సీ పొందని బస్సులు 203

రాయవరం: ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల సామర్థ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. గత నెల 15వ తేదీ నుంచి స్కూల్ బస్సుల వాహన సామర్థ్యం (ఫిట్‌నెస్) తనిఖీ చేసి, సర్టిఫికెట్ జారీ చేసే ప్రక్రియను జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రారంభించారు. జిల్లాలోని రవాణాశాఖాధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉండగా, ఇంకా నత్తనడకన సాగుతోంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం ముందునుంచే స్కూల్ బస్‌ల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లావ్యాప్తంగా ఇంకా 203 స్కూల్ బస్‌లు ఫిట్‌నెస్‌ను పొందకపోవడం గమనార్హం.

ఎఫ్‌సీ తప్పనిసరి

ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు రోడ్డు మీదకు రావాలంటే తప్పనిసరిగా రవాణా శాఖ జారీ చేసిన సామర్థ్య ధ్రువీకరణ పత్రం(ఎఫ్‌సీ) ఉండాలి.



బస్సు అత్యవసర ద్వారాన్ని తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్

జిల్లాలో అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, మండపేటలో మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాల పరిధిలో 820 ప్రైవేట్ స్కూల్ బస్సులున్నాయి. గత నెల 15 నుంచీ ఇప్పటి వరకు 617 బస్సులకు రవాణాశాఖ అధికారులు ఎఫ్‌సీలు జారీ చేశారు. ఎంవీఐలు నిశితంగా తనిఖీలు నిర్వహించారు. బస్సుల లోపాలను గుర్తించి, నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఫిట్‌నెస్ కోసం వచ్చిన బస్సులను పరిశీలించిన అధికారులు కొన్ని లోపాలను కూడా గుర్తించారు. అత్యవసర ద్వారం త్వరగా తెరుచుకోకపోవడం, టైర్లు కండిషన్‌లో లేక పోవడం, హ్యాండ్ బ్రేక్ సరిగ్గా పనిచేయక పోవడం, కొన్ని బస్సుల్లో సీట్లు సరిగ్గా లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు.

రక్షణకు శిక్షణ అవసరం

రహదారి భద్రతలో భాగంగా ప్రమాదాల నివారణకు విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు ఏటా శిక్షణ ఇవ్వడం కూడా అవసరమే. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున డ్రైవర్లకు రవాణా శాఖ అధికారులు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తే ప్రమాదాల నివారణకు వీలవుతుంది. బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్ల ఆవశ్యకత, బ్రేక్‌లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంజిన్, గేర్ వ్యవస్థ పనితీరు, అత్యవసర ద్వారం ప్రాముఖ్యత, అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా వినియోగించాలి? వాహనాల్లో ఉపయోగిస్తున్న టెక్నాలజీ, వివిధ విడిభాగాల పనితీరు, ప్రమాదాలకు దారితీసే కారణాలు, నివారణ చర్యలపై డ్రైవర్లకు శిక్షణ అవసరం. విద్యార్థుల భద్రత, రక్షణతో ముడిపడి ఉన్న ఇటువంటి విషయాలపై డ్రైవర్లకు సంపూర్ణ అవగాహన ఉండడం ఎంతో మేలు చేస్తుంది. డ్రైవర్లకు ఎఫ్‌సీలు జారీ చేసే సమయంలో ఎంవీఐలు మెళకువలను చెప్పినప్పటికీ పూర్తి స్థాయిలో అవగాహన కలగడం లేదనే విమర్శలున్నాయి.

విద్యార్థులకు కూడా..

పాఠశాలలు పునఃప్రారంభమైనందున బస్సుల్లో విద్యార్థులు ఏ విధంగా ప్రయాణించాలి? ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా బయట పడాలి? తదితర అంశాలపై విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలి. విద్యాసంస్థలకు వెళ్లి రవాణా శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తాం



ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఎఫ్‌సీలు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇంకా 203 బస్సులు ఎఫ్‌సీలు చేయించుకోవాల్సి ఉంది. మరమ్మతులు చేయించుకుంటున్న బస్సులు ఇంకా ఎఫ్‌సీలు పొందాల్సి ఉంది. విద్యా సంస్థలకు వెళ్లి విద్యార్థులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు వచ్చే నెల మొదటి వారం నుంచి కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తాం.

– డి.అశోక్‌ప్రతాప్‌రావు, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, అమలాపురం

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సీ ఎగ్జామ్స్ కలిసి ఈ నెల 24వ తేదీ (శనివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు కాకినాడ కల్పన సెంటర్ సమీపాన దంటు కళాక్షేత్రంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే. త్వరలోనే 1000కిపైగా గ్రూప్–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం, దీనికితోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 89850 94499 నంబరుకు తమ పేరు, ఫోన్ నెంబరు, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

SAKSHI MEDIA GROUP
www.sakshi.com

అవగాహన సదస్సు తేదీ: ఈ నెల 24 (శనివారం)

వేదిక: దంటు కళాక్షేత్రం.. మున్సిపల్ ఆఫీస్ వెనుక, కల్పన సెంటర్, కాకినాడ

సమయం: ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

నృత్యాహంగా.. ఉల్లాసంగా..

- 14 గంటల 2 నిమిషాల 2 సెకండ్ల పాటు నిర్విరామంగా నృత్య ప్రదర్శన
- నాలుగు ప్రపంచ రికార్డులు నెలకొల్పిన కళాకారిణులు
- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న కళాసమ్మేళనం 2023



సామూహికంగా నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అఖండ గోదావరి తీరం గురువారం నృత్యాభినయంతో పులకించిపోయింది. రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో కళాసమ్మేళనం 2023 పేరిట నిర్వహించిన జాతీయ డాన్స్‌ఫెస్ట్ ఉర్రుతలూగించింది. ఆనం కళాకేంద్రంలో గురువారం ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన నృత్య ప్రదర్శన రాత్రి 7.40 గంటల వరకు కొనసాగింది.

రామదూత అతులిత బలధామా..

హనుమాన్ చాలీసాకు పాదం కలిపి నృత్యం అభినయించడం అంటే మామూలు విషయం కాదు. అదీ కూడా ఆగకుండా 14 గంటల 2 నిమిషాల 2 సెకండ్ల పాటు నిర్విరామంగా నర్తించడం సాధారణ విషయం కాదు. ప్రతి 15 నిమిషాలకొకసారి తొమ్మిది మంది కళాకారిణిలు తమ నృత్యాభినయాన్ని కొనసాగించారు. వారి తరువాత వెంటనే మరో తొమ్మిది మంది కళాకారిణులు నృత్యం చేశారు. ఈ విధంగా 99 మంది నృత్య కళాకారిణిలతో పాటు అదనంగా మరో ఇద్దరు కళాకారిణులు కూడా నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నాలుగేళ్ల చిన్నారుల నుంచి 16 సంవత్సరాల అమ్మాయిల వరకు ఉత్సాహంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని చక్కగా నర్తించడం ప్రేక్షకులను మైమరచిపోయేలా చేసింది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ప్రదర్శనలో కాలిఫోర్నియా, దుబాయి వంటి దేశాల నుంచే కాకుండా మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా కంఠతా పట్టిన చిన్నారులు

సరిగ్గా మాటలు కూడా రాని చిన్నారులు ఎంతో క్లిష్టమైన హనుమాన్ చాలీసాను నృత్యాభినయం కోసం కంఠతా పట్టారు. 8.30 నిమిషాలు పాటు సాగే హనుమాన్ చాలీసా, ముందుగా వచ్చే 10 నిమిషాలు పాటు సాగే శ్లోకాలు అవలీలగా చెప్పగలుగుతున్నారు. ప్రతి భారతీయుని ఇంటిలో పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను, రామాయణ, భారతం వంటి ఇతిహాసాలకు చెందిన కథలను, శ్లోకాలను నేర్పించడం వల్ల మంచి ఆదర్శవంతులుగా తయారు అవుతారనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జీబీ నారాయణ తెలిపారు.

వరల్డ్ రికార్డ్స్ ఇవే...

భారత్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డెన్ స్టార్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయ్యాయి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ఇంకా ధ్రువీకరణ రావాల్సి ఉందని నిర్వాహకుడు జీబీ నారాయణ తెలియచేశారు. గుంటూరులోని శ్రీశైవ స్థాపకుడు శ్రీశివ స్వామి చేతుల మీదుగా కళాకారులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. డాక్టర్ కుషల్ భట్టాచార్య, డాక్టర్ పోతిన శ్రీనివాస్, డాక్టర్ గోరుగుంతు ఉమాజయశ్రీ, తిరుపతి శ్రీవాణియాళ్ళ, షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.



గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



బంగార్రాజు మృతదేహం

సీతానగరం: అప్పటి వరకు తోటివారితో నవ్వుతూ మాట్లాడిన ఉపాధి కూలీ పలివెల బంగ్రార్రాజు (42) ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. వివరాల్లోకి వెళ్లితే సీతానగరానికి చెందిన పలివెల బంగార్రాజు ఉపాధి హామీ పథకం కూలీ పనులకు వెళుతుంటాడు. గురువారం ఉదయం సీతానగరం లంకభూమిలో రోడ్డు పనులకు వెళ్లాడు. తోటి కూలీలతో నవ్వుతూ పనిచేశాడు. తోటి కూలీకి గుండె నొప్పిగా ఉంది అని చెప్పి రెండు అడుగులు ముందుకు వేసి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఏపీవో నాగశేషవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణవేణి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా గుండెపోటుతో మరణించాడని నిర్ధారించారు. బుధవారం సాయంత్రం నొప్పిగా ఉందని చెప్పాడని, గ్యాస్ నొప్పి అయిఉండవచ్చని తనే సర్దిచెప్పుకున్నాడని భార్య ధనలక్ష్మి విలపిస్తూ చెప్పింది. నాలుగు రోజుల్లో 8వ తరగతి చదువుతున్న కుమార్తె వర్షిణి పుష్పవతి ఫంక్షన్ చేస్తానని చెప్పాడని భార్య బోరున విలపించింది. 10 వ తరగతి చదువుతున్న కుమారుడు శ్యామ్, కుమార్తె వర్షిణి కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను కలచి వేసింది. వైఎస్సార్ బీమా పథకంలో మట్టి ఖర్చులు రూ.10 వేలు సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ అందించారు.

నేడు అంతర్జాతీయ ఒలింపిక్ రన్



విలేకరులతో మాట్లాడుతున్న నవీన్, పద్మనాభం

కాకినాడ సిటీ: అంతర్జాతీయ ఒలింపిక్ రన్‌ను శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకే రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ది సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు ముత్తా నవీన్, కె.పద్మనాభం తెలిపారు. గురువారం కాకినాడ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత నెలలో ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో మినీ ఒలింపియడ్‌ను 15 క్రీడాంశాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బంగారు, వెండి, కాంస్య పతకాలతో పాటు 800 మందికి సర్టిఫికెట్లు జాతీయ క్రీడాకారుడు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు చేతుల మీదుగా ఇచ్చామన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ రన్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 17 సెంటర్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రన్‌లో పాల్గొనే వివిధ సంఘాలు, క్రీడాకారులను ప్రోత్సహించి అందరికీ ప్రశంసా పత్రాలు ఇస్తామన్నారు. సాధారణంగా ఈ ఒలింపిక్ రన్ అనేది ముంబయి, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల్లో చేయడం ఆనవాయితీగా ఉందన్నారు. అయితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన నగరాలైన కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, తునితో పాటు, మేజర్ పట్టణాలైన రాజోలు, పిఠాపురం, విరవ, రామచంద్రపురం రావులపాలెం, మామిడికుదురు, తాటిపాక, కోరంగి తదితర ప్రాంతాల్లో ఈ ఒలింపిక్ రన్ జరుగుతుందన్నారు. వచ్చే ఏడాది మినీ ఒలింపియాడ్‌ను అమలాపురంలో ఏర్పాటు చేయడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. ఒలింపిక్ రన్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికి క్రీడల పట్ల ఆసక్తి, గౌరవం పెంచే విధంగా ఒలింపిక్ ప్రతిజ్ఞ చేయిస్తామని నవీన్, పద్మనాభం వివరించారు.

వాహనం ఢీకొని ఆర్ఎంపీ వైద్యుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

కడియం: మండలంలోని కడియపులంక వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున వాహనం ఢీకొని ఆర్ఎంపీ వైద్యుడు తాతపూడి ప్రసాద్ (54) మృతి చెందారు. పోలీస్‌లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రూరల్ మండలం కోలమూరులో నివాసం ఉంటున్న ప్రసాద్ మోటారు సైకిల్‌పై ఆలమూరు మండలం చొప్పెల్ల వెళ్లి తిరిగి వస్తున్నారు. కడియపులంక వద్దకు వచ్చేసరికి తెల్లవారు జామున వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందారు. వ్యాన్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బస్సును ఢీ కొని యువకుడి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం సమీపంలోని శ్రీరామనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఇద్దరు యువకులలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.. శ్రీరామనగర్‌కు చెందిన అల్లు రఘువీర్ (23), స్నేహితుడు రాకోటి శివసాయితో కలిసి బైకుపై రాంగ్ రూట్‌లో ప్రయాణించి, ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రఘువీర్ అక్కడికక్కడే మృతి చెందగా, శివసాయి తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం గురువారం బంధువులకు అప్పగించారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు

- కావాలనే సూర్యచక్రంపై బురద చల్లుతున్నారు
- బాలకామేశ్వరి అత్త నూకరత్నం, బావ గోవిందు స్పష్టీకరణ



విలేకరులతో మాట్లాడుతున్న పారేపల్లి నూకరత్నం, గోవిందు, సర్పంచ్ కృష్ణ

తుని: అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని 2.37 ఎకరాల భూమిని మంత్రి దాడిశెట్టి రాజా మామ దేవవరపు సూర్యచక్రం బలవంతంగా దక్కించుకోవాలని చూస్తున్నారని పాయకరావుపేట మండలం పాల్తేరుకు చెందిన బాల కామేశ్వరి ఇటీవల చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆమె కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఖండించారు. కాకినాడ జిల్లా తుని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బాల కామేశ్వరి అత్త పారేపల్లి నూకరత్నం, బావ గోవిందు, గ్రామ సర్పంచ్ గోసాల కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు ఇసరపు సత్యనారాయణ గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జగ్గంపేట మండలం కొత్తూరుకు చెందిన బాల కామేశ్వరి 2017లో పాల్తేరుకు చెందిన కొమ్మిరెడ్డి సత్తిబాబుకు ఎకరం రూ.1.18 కోట్లు చొప్పున బేరం కుదుర్చుకొని రూ.25 లక్షలు తీసుకుంది. దీనిపై అత్త నూకరత్నం, బావ గోవిందు ఉమ్మడి ఆస్తిని తమకు చెప్పకుండా ఎందుకు అమ్మారని ప్రశ్నించారు. దీంతో గొడవ పడి విశాఖజిల్లా యలమంచిలి కోర్టులో కేసు వేశారు. అగ్రిమెంట్ చేసుకున్న కొమ్మిరెడ్డి సత్తిబాబు తన సొమ్ము తిరిగి ఇవ్వాలని బాల కామేశ్వరిని పలు మార్లు అడిగినా పట్టించుకోలేదు. దీంతో అదే గ్రామానికి చెందిన దేవవరపు సూర్యచక్రం దగ్గరకు కుటుంబ సభ్యులు వెళ్లి సెటిల్‌మెంట్ చేసుకున్నారు. ముగ్గురికి సమాన వాటాలు వేసి పంపకాలు చేశారు. అందులో వచ్చిన 2.37 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టగా పెద్దల సమక్షంలో ఎకరాకు రూ.1.70 కోట్లు చొప్పున ఖరీదు కట్టారు. గతంలో అగ్రిమెంట్ చేసుకున్న కొమ్మిరెడ్డి సత్తిబాబును తీసుకోవాలని సూచించారు. అంత ధరకు కొనలేనని సత్తిబాబు చెప్పడంతో అదే ధరకు తీసుకోవాలని సూర్యచక్రాన్ని కోరారు. దీంతో పెద్దల సమక్షంలో 2021లో రూ.92.50 లక్షలు తీసుకుని క్రయ అగ్రిమెంట్ చేశారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత లేకపోవడంతో బాలకామేశ్వరి తన బావ గోవిందును పిలిచి చెప్పగా కోర్టు కేసులో బాల కామేశ్వరి కుమార్తె హేమశ్రీ మైనారిటీగా ఉన్నందున కొంతకాలం ఆగాలని చెప్పారు. ఆమె ఈ నెల 17న సూర్యచక్రం దగ్గరకు వచ్చి రూ.50 లక్షలు కావాలని ఒత్తిడి చేసింది. దీంతో కోర్టు నుంచి లీగల్ హెయిర్ సర్టిఫికెట్ తెచ్చుకుంటే రిజిస్ట్రేషన్ చేయించుకొని మొత్తం సొమ్ము ఇస్తామని చెప్పారు. దీంతో ఆమె కొందరి ప్రోద్బలంతో ఈ నెల 19న తునిలో మీడియా సమావేశం పెట్టి సూర్యచక్రంపై ఆరోపణలు చేసిందన్నారు. ఆమె తీరును కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు.

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయేవాళ్లం

- క్షేమంగా ఇంటికి చేరిన మృత్యుంజయుడు అప్పారావు
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు



కుటుంబ సభ్యులతో అప్పారావు

పిఠాపురం: ఆ దేవుడే కాపాడాడు. లేకపోతే మా ఇంటి పెద్ద దిక్కును కోల్పోయే వాళ్లం. జరిగిన సంఘటన వింటేనే భయమేస్తోంది అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు నడి సంద్రంలో 12 గంటల పోరాటం అనంతరం ప్రాణాలతో బయటపడిన మృత్యుంజయుడు గేదెల అప్పారావు కుటుంబ సభ్యులు. మంగళవారం రాత్రి సముద్రంలో పడిపోయిన అప్పారావును బుధవారం రక్షించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స అనంతరం కాకినాడ శివారు రేపూరులో తన ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు. అతనిని చూసిన భార్య సత్యవేణి, కుమార్తె రేఖ, కుమారుడు చందులు ఒక్కసారిగా ఉద్వేగానికి గురయ్యారు. 'వేటాడితేనే గాని పూట గడవని కుటుంబం అయినప్పటికీ ఉన్నంతలో కుటుంబాన్ని తండ్రి ఎంతో ప్రేమగా చూసుకునేవాడు'. తను సముద్రంలో గల్లంతయ్యాడన్న వార్త విని ఇక మాకు దిక్కెవరు అనుకున్నాం. కానీ దేవుడు మా మొర విని మా నాన్నను మాకు తిరిగి ఇచ్చాడు అంటూ పిల్లలు అప్పారావును హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ 12 గంటల పాటు ఎలా ఈదుతూ ఉన్నానో కూడా తెలియని పరిస్థితి అని, అప్పటి వరకు ఓపికతో ఉన్నా ఇక నేను చనిపోవాల్సిందే అనుకుంటున్న సమయంలో నన్ను రక్షించారని తెలిపారు.

యువకుడి హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- ప్లాన్ వేసిన భార్య, అత్త
- హాఫీజ్ తలపై గునపంతో కొట్టి చంపిన నిందితుడు
- ఆరు రోజుల్లో కేసు ఛేదించిన సమిశ్రగూడెం పోలీసులు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో ఈ నెల 17న షేక్ హాఫీజ్ అనే యువకుడిని హత్యచేసిన ఘటనలో అట్లపాడు గ్రామానికి చెందిన పుచ్చకాయల శేఖర్‌తో పాటు అత్త తలారి బేబి, భార్య షేక్ హసీనాలను గురువారం అరెస్ట్ చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సమిశ్రగూడెం గ్రామానికి చెందిన షేక్ హాఫీజ్ (23) అదే గ్రామానికి చెందిన తలారి భవానీ (హసీనా)ను ప్రేమించి మూడేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. పెళ్లికి హాఫీజ్ పెద్దలు అంగీకరించకపోవడంతో భార్య హసీనా ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా హాఫీజ్ భార్య హసీనాను వేధించడంతో పాటు కుటుంబ పోషణ పట్టించుకోవడం లేదు. డబ్బుల కోసం అత్త బేబిని బెదిరించాడు. బేబితో వివాహేతర సంబంధం సాగిస్తున్న పుచ్చకాయల శేఖర్‌ను హాఫీజ్ వ్యతిరేకించాడు. దీంతో అల్లుడు హాఫీజ్‌ను అడ్డు తొలగించుకునేందుకు హత్యచేయాలని శేఖర్, బేబి ప్లాన్ చేయగా మృతుడి భార్య హసీనా కూడా సహకరించింది. ప్లాన్ ప్రకారమే ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటలకు అట్లపాడు నుంచి సైకిల్‌పై వచ్చిన శేఖర్ తనతో పాటు తీసుకువచ్చిన గునపంతో ఆరుబయట మంచంపై నిద్రిస్తున్న హాఫీజ్ తల వెనుక భాగంలో బలంగా కొట్టి హత్యచేసి పారిపోయాడు. భార్య హసీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ట్రైనీ ఐపీఎస్ పంకజ్‌కుమార్ మీనా, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా హాఫీజ్‌ను హత్యచేసిన శేఖర్‌తో పాటు అత్త తలారి బేబి, భార్య షేక్ హసీనాలను గురువారం మధ్యాహ్నం సమిశ్రగూడెంలో అరెస్ట్ చేసి గునపం, సైకిల్, సెల్‌ఫోన్‌ను స్వాధీన పర్చుకున్నామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసును ఆరు రోజుల్లో ఛేదించడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసిన నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వర రావు, నిడదవోలు, సమిశ్రగూడెం, కొవ్వూరు ఎస్సైలు నాగరాజు, షేక్ సుభానీ, రవీంద్రబాబు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

ఐదు కేసులకు సంబంధించి 202 గ్రాముల బంగారం, 30 తులాల వెండి వస్తువులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు. చిత్రంలో స్వాధీనం చేసుకున్న వస్తువులు

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక గ్రామానికి చెందిన డేగల శ్రీనివాస్‌ను కడియం పోలీసులు అరెస్టు చేసి, ఐదు చోరీ కేసులను ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ మండలం డీఎస్పీ కె.శ్రీనివాస్ వెల్లడించారు. జనవరి నెలలో తేజ అనే నర్సరీ రైతు ఇంట్లో రూ.25వేల నగదు, 50 గ్రాముల బంగారం, 10 తులాల వెండి మాయమైంది. మార్చినెలలో బుర్రిలంక ఫంక్షన్ హాల్ సమీపంలోని సరోతి చినబాబు ఇంట్లో బీరువాలోని బంగారు చెవిదుద్దులు, రెండు బంగారం ముక్కలు, వెండి చెంబు, రెండు జతల వెండి పట్టీలు చోరీ అయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన సుంకర గోవిందు ఇంట్లో 79 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. పత్తి రంగారావు అనే వ్యక్తి ఇంట్లో తొమ్మిది గ్రాముల బంగారు ఆభరణాలు కూడా చోరీ అయ్యాయి. వరుసగా ఆరు నెలల వ్యవధిలో అయిదు చోట్ల చోరీలు జరగడంతో కడియం పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తన సిబ్బందితో కలిసి వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో వారి అనుమానం డేగల శ్రీను మీదికి మళ్లింది. కడియపులంక చాకలిరేవు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించడంతో గ్రామంలో జరిగిన ఈ దొంగతనాలను తానే చేశానని ఒప్పుకున్నాడని డీఎస్పీ శ్రీనివాస్ వివరించారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం 202.12 గ్రాముల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు విలాసవంతమైన జీవితం, వ్యసనాల కారణంగా ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన సురేష్‌బాబు, సీహెచ్ రమణ, లక్ష్మణ్, ప్రసన్నకుమార్‌లను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.